నేడే విడుదల



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- జిల్లాలో రెండుకేంద్రాల ఏర్పాటు
- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టం
- జిల్లావ్యాప్తంగా బలగాల మోహరింపు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు, కుర్చీలు

పుట్టపర్తి, జూన్3(ఆంధ్రజ్యోతి): అంతటా ఉత్కంఠ. ఎటుచూసినా ఒకటే చర్చ. అదే సార్వత్రిక ఎన్నికల ఫలితం. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశారు. ఆ సమయం రానేవచ్చింది. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు వేళయింది. మంగళవారం ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి, ఫలితం వెలువరించనున్నారు. మరికొన్ని గంటల్లో ఫలితాలు వెలువడనున్నాయి. క్రమక్రమంగా ఉత్కంఠకూ తెరపడ నుంది. హిందూపురం పార్లమెంటు, ఆరు అసెంబ్లీ స్థానాల కౌంటింగ్ చేపట్టనున్నారు. కూటమి, వైసీపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. జిల్లాలో టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణతో పాటు గత ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, మంత్రి, ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, తొలిసారిగా పోటీ చేస్తున్న అభ్యర్థులతోపాటు ఆయా పార్టీల శ్రేణులు, జిల్లా ప్రజలు ఫలితాలపై తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ స్థానం మినహా అన్నింటినీ వైసీపీ గెలిచింది. ఈసారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా జతకట్టాయి. వైసీపీకి దీటైన గెలుపు గుర్రాలను బరిలో నిలిపారు. ఈనేపథ్యంలో జిల్లాలో వైసీపీకి ముచ్చెమటలు పడుతున్నాయి. ఎన్నికల్లో గెలుపు కోసం ఆయాపార్టీల నేతలంతా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని వైసీపీ భావిస్తోంది. రాష్ట్రంలో అరాచక పాలన, ప్రభుత్వంపై వ్యతిరేకత ఆ పార్టీని కలవర పరుస్తున్నాయి. భారీగా పోలింగ్ నమోదవడం కూడా అధికార పార్టీని ఆందోళనలోకి నెట్టింది. ఎగ్జిట్ పోల్స్‌లో మెజార్టీ సంస్థలు కూటమిదే అధికారం అని ప్రకటించడంతో వైసీపీలో ఆందోళన తీవ్రమైంది. జిల్లాలో అన్ని స్థానాలను గెలుస్తామనీ, కచ్చితంగా రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని కూటమి నేతలు ధీమాతో ఉన్నారు. ఫలితాలు వెలువడిన వెంటనే సంబరాలు చేసుకునేందుకు సన్నాహకాలు చేసుకుంటున్నారు. జిల్లాలో ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోనే గట్టెక్కుతారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

బరిలో నిలిచింది వీరే..

సరిగ్గా 58 రోజుల క్రితం సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో టీడీపీ జనసేన, బీజేపీ కూటమి తరఫున గెలుపు గుర్రాలను బరిలోకి దింపారు. హిందూపురం ఎంపీ స్థానం నుంచి బీకే పార్థసారథి, ఎమ్మెల్యేగా నందమూరి బాలకృష్ణ, రాప్తాడు నుంచి పరిటాల సునీత, పెనుకొండ నుంచి సవిత, కదిరి నుంచి కందికుంట వెంకటప్రసాద్, పుట్టపర్తి నుంచి పల్లె సింధూరారెడ్డి, మడకశిర నుంచి ఎంఎస్ రాజు, ధర్మవరంలో సత్యకుమార్ యాదవ్‌ను పోటీలో నిలిపారు. వైసీపీ నుంచి హిందూపురం ఎంపీ అభ్యర్థిగా జే శాంతతోపాటు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పుట్టపర్తి శ్రీధర్‌రెడ్డి, ధర్మవరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, రాప్తాడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మళ్లీ బరిలో దిగారు. హిందూపురం నుంచి దీపిక, మడకశిర నుంచి ఈరలక్కప్ప, పెనుకొండ నుంచి ఉషశ్రీచరణ్, కదిరి నుంచి మక్బుల్ అహమ్మద్ పోటీలో ఉన్నారు.

అసెంబ్లీలోకి అడుగు పెట్టేదెవరో?

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బెట్టింగ్ జోరుగా సాగింది. ఎగ్జిట్‌పోల్స్, సర్వేలు కూటమికే అనుకూలంగా వెలువడడంతో వైసీపీలో ఆందోళన మొదలైంది. లోలోపల ఓటమి భయం వెంటాడుతున్నా బయటికి మాత్రం సంక్షేమ పథకాల తమను గెలిపిస్తాయని అధికార పార్టీ అభ్యర్థులు, నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ఆ పార్టీలో ఆందోళన రేపుతోంది. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వణుకు పుట్టిస్తున్నాయి. టీడీపీ సూపర్ సిక్స్ హామీలు, కూటమి కలయికతో తమకు తిరుగులేదని ఆ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హోరాహోరీగా సాగిన పోరులో విజయం ఎవరిని వరిస్తుందో మరి కొన్నిగంటల్లో తేలనుంది.

భారీ భద్రత

- బిట్స్ కళాశాల, గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి
- నాలుగంచెల భద్రత
- ఉదయం 5గంటలకే లెక్కింపు కేంద్రాలకు అధికారులు
- పట్టణాల్లో డ్రోన్లతో నిఘా



కౌంటింగ్ కేంద్రంలో బందోబస్తుకు హాజరైన పోలీసులు

హిందూపురం, జూన్ 3: ఓట్ల లెక్కింపురోజున కనీవినీ ఎరుగని రీతిలో కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి లెక్కింపు పూర్తయి ఈవీఎం బాక్సులు సీల్ చేసేవరకు భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ఈసారి లెక్కింపు కేంద్రాలు, పరిసర ప్రాంతాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎస్పీతోపాటు ఏఎస్పీ, పదిమంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 40మందికిపైగా ఎస్ఐలు, 300 మందికిపైగా పోలీసులు, సాయుధబలగాలు, 500 మంది ఇతర విభాగాల సిబ్బంది బందోబస్తులో ఉంటారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద, పట్టణాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నలుగురికన్నా ఎక్కువ మంది గుమిగూడినా, విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించినా కేసులు నమోదు చేయనున్నారు.

నాలుగంచెల భద్రత

ఓట్ల లెక్కింపు చేపట్టే బిట్ కళాశాల, గురుకుల పాఠశాల వద్ద నాలుగంచెల భద్రత ఏర్పాటు చేశారు. కేంద్ర సాయుధ బలగాలతోపాటు స్థానిక పోలీసులు పహారా కాస్తున్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకే కౌంటింగ్‌లో పాల్గొనే అధికారులు వారికి కేటాయించిన కేంద్రాల్లోకి చేరుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏజెంట్లు కూడా నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలి.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జూన్ 3: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు సాగేలా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు అరుణ్‌బాబు కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా సహకరించాలన్నారు. ఉదయం 7 గంటల్లోపు అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్నీ సజావుగా సాగితే ఫలితాలు సాయంత్రం 4 గంటలకు ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు వివాదాలకు అవకాశమిస్తే వారిని వెంటనే బయటకు పంపిస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ మొదలయ్యాక భోజన విరామం ఉండదనీ, పూర్తయ్యే వరకు కొనసాగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అధికారులు సిబ్బంది, అభ్యర్థులు ఏజెంట్లు 4వేలమంది ఉంటారన్నారు. 160 సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూంకు అనుసంధానం చేసి, కౌంటింగ్ సరళిని పర్యవేక్షిస్తామని కలెక్టర్ వివరించారు.

గొడవలకు దిగితే జైలుకే..

ఎస్పీ మాధవరెడ్డి



గురుకుల పాఠశాల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి రూరల్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గొడవలకు దిగితే జైలుకు పంపుతామని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత కౌంటింగే లక్ష్యమన్నారు. ఆ దిశగా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు. గొడవలు సృష్టిస్తే జైలుకు పంపుతామనీ, ఇందులో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటాయని తెలిపారు. కౌంటింగ్ అనంతరం 6వ తేదీ సాయంత్రం వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందనీ, విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. సవ౦స్యా త్మక ప్రాంతాలు, ట్రబుల్ మాంగర్స్‌పై నిరంతర నిఘా ఉంటుందని ఎస్పీ వివరించారు.

అలసత్వం వహిస్తే ఉద్యోగాలు ఊడతాయ్

హిందూపురం: కౌంటింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీసులు అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఉద్యోగాలు ఊడతాయని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. బిట్స్ కళాశాల, గురుకుల పాఠశాల కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులకు హాజరైన సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. కౌంటింగ్ సందర్భంగా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే లోపలకు పంపాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదన్నారు. అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు.



మద్యంషాపులు బంద్

ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం

హిందూపురం అర్బన్, మే 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో మద్యం షాపులను బంద్ చేశారు. 5వ తేదీ వరకు మద్యం దుకాణాలు, బార్లు నిర్వహించరాదని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. దీంతో పట్టణంలో మద్యం దుకాణాలను సెబ్ అధికారులు మూసేసి, సీల్ వేశారు. దీంతో కర్ణాటక మద్యం జిల్లాలోకి వెల్లువలా వస్తోంది. పట్టణంలో ఏరులై పారుతుంది. టెట్రా ప్యాకెట్ల అమ్మకం జోరుగా కొనసాగుతోంది. కఠిన నిబంధనలు అమలు చేస్తున్నా.. పోలీసు నిఘా భారీగా ఉన్నా కర్ణాటక మద్యానికి మాత్రం అడ్డుకట్ట పడట్లేదు. జిల్లాలో మద్యం దుకాణాలు బంద్ చేయడంతో ఏరులై పారుతోంది. 4, 5 తేదీల్లో కూడా కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా అవకాశం ఉంది. ఈ మద్యం తాగి, కౌంటింగ్ సందర్భంగా గొడవలకు దిగే ప్రమాదం లేకపోలేదు. ఈ నేపథ్యంలో కర్ణాటక మద్యానికి పోలీసులు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందరి చూపు.. అటే..

- పోస్టల్ బ్యాలెట్‌పైనే అందరి దృష్టి
- భారీగా పోలైన ఓట్లు
- వైసీపీ శ్రేణుల్లో వణుకు





ధర్మవరం, జూన్ 3: వైసీపీ అభ్యర్థులను ఎగ్జిట్ పోల్స్‌తోపాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఆందోళనను లోనుచేస్తున్నాయి. ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న ఉద్యోగులు కూటమికే పూర్తిస్థాయిలో ఓట్లేశారనే సమాచారంతో అధికార పార్టీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పలు నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గెలుపోటములను శాసించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో అత్యధికంగా కదిరిలో 3,412, మడకశిరలో అత్యల్పంగా 1376 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. ఆరు నియోజకవర్గాల్లో కలిపి 14,028 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలవ్వడంతో అధికార పార్టీ అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. గతంలో జిల్లాలో భారీ మెజారిటీతో అభ్యర్థులు గెలుపొందారు. ఈసారి గెలిస్తే చాలు అన్నట్టు వైసీపీ శ్రేణులు అంచనాలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకపాత్ర పోషించనున్నాయి. సర్వీసు ఓట్లు కూడా 1147 పోలయ్యాయి.

రెండు కేంద్రాల్లో కౌంటింగ్

పుట్టపర్తి, జూన్ 3: నూతన జిల్లాలో మొదటిసారి సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం రెండు కేంద్రాల్లో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. హిందూపురంలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మడకశిర, హిందూపురం, పెనుకొండ, కదిరి అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. లేపాక్షి మండలం చోళసముద్రం అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ధర్మవరం, పుట్టపర్తి అసెంబ్లీ, హిందూపురం ఎంపీ స్థానాల ఓట్ల లెక్కింపు చేపడతారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,56,775 మంది ఓటర్లు ఉండగా.. 14,05,277 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 84.70గా నమోదైంది.

జిల్లాలో ఓట్ల వివరాలు ఇలా..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	టేబుళ్లు	రౌండ్లు	పోలైన ఓట్లు	పోస్టల్ బ్యాలెట్	హోం ఓట్లు	సర్వీసు ఓట్లు
ధర్మవరం	290	14	21	2182282	2628	369	258
కదిరి	281	14	21	206208	3412	377	262
పెనుకొండ	265	14	19	205213	2240	279	203
హిందూపురం	253	14	19	193882	2054	219	87
మడకశిర	241	14	18	184454	1376	386	79
పుట్టపర్తి	241	14	18	182083	2318	490	258



సంబరాలకు సన్నద్ధం

కూటమి అభ్యర్థుల్లో విజయంపై ధీమా



- పార్టీలు చేసుకునేందుకు ఏర్పాట్లు
- డీలాపడిన వైసీపీ శ్రేణులు
- గెలిచాక చూద్దాంలే అన్న నిర్లిప్తత




ధర్మవరం, జూన్ 3: రిజల్ట్ డే రానే వచ్చింది. గెలిచేదెవరో కొన్ని గంటల్లో తేలిపోనుంది. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కూట మి, వైసీపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఇరు పక్షాల్లో విభిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపుపై ధీమాతో ఉంది. ఇప్పటికే కూటమి వర్గీయులు సంబరాలకు సన్నాహకాలు చేసుకున్నారు. ఫలితాలు ముగియగానే పార్టీలకు ప్లాన్ చేసుకున్నారు. టపాసులు కూడా సిద్ధం చేసుకుని, పోలీసుల అనుమతి కోసం వేచి చూస్తున్నారు. ఈనెల 1న వెలువడిన ఎగ్జిట్ పోల్స్ కూటమికి పట్టం కట్టాయి. దీంతో ఆ వర్గీయుల్లో ఉత్సాహం నెలకొంది. వైసీపీ శిబిరం డీలా పడింది. పైకి గెలుస్తామంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. అంతర్గతంగా వారి పరిస్థితిని చూస్తే ఓటమిని అంగీకరించినట్లేనన్నది స్పష్టమవుతోంది. ఈ సారి తమ పార్టీ కథ కంచికే అని వైసీపీ శ్రేణులు నిరాశ చెందుతున్నట్లు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అధికారంలోకి ఎవరు వచ్చేది స్పష్టంకానుంది. ఎగ్జిట్ పోల్స్, రాష్ట్రవ్యాప్తంగా పరిణామాలను గమనిస్తున్న అధికార పార్టీ నాయకుల్లో దడ మొదలైందని వారి మాటల ద్వారా స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ గెలుపుపై బెట్టింగ్ వేసేందుకు కూడా ఎవరూ ముందుకురావట్లేదు. కూటమి అధికారం చేపడుతుందని వైసీపీ నాయకులే పలువురు బెట్టింగ్ వేయడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

కూటమిలో ఉత్సాహం

సార్వత్రిక ఎన్నికల సరళిని బట్టి చూస్తే కూటమిలో విజయోత్సాహం ఉరకలేస్తోంది. ఈసారి గెలుపు తమదేనంటూ ఘంటాపథంగా చెబుతున్నారు. ఎగ్జిట్‌పోల్స్ కూడా అనుకూలంగా రావడం వారి ఆనందాన్ని రెట్టింపు చేసింది. మంగళవారం ఫలితాలు వెలువడగానే సంబరాలకు సైతం సన్నద్ధమయ్యారు. ఇప్పటికే బాణసంచా, భారీఎత్తున పూలమాలలు సిద్ధం చేస్తున్నారు. స్థానికంగా కష్టపడిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలు ఈ సంబరాల్లో భాగం పంచుకోవడానికి ఉత్సాహపడుతున్నారు. మరికొందరైతే విందులకు సైతం వెనుకాడటం లేదు. అందుకు తగ్గట్టు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. ధర్మవరం మండలానికి చెందిన ఓ బీసీ నాయకుడు కూటమి అధికారంలోకి రాగానే భారీ ఎత్తున విందు ఏర్పాటుచేయడానికి పూనుకున్నట్లు చర్చ సాగుతోంది. ఖర్చుకు వెనకాడకుండా అన్నీ సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ధర్మవరం పట్టణంలోని చేనేత వర్గానికి చెందిన ఓ ప్రముఖ నాయకుడు ఇటీవల వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలోకి చేరారు. ఆయన కూటమి గెలుపొందగానే ప్రముఖులను పిలిపించి, భారీఎత్తున విందు ఏర్పాటుకు సిద్ధం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. పలువురు విందులకు ఏర్పాట్లు చేసుకున్నారు.

వైసీపీ నాయకుల్లో ఆందోళన



సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ సరళిని గమనించిన కొందరు అధికార పార్టీ నాయకులు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎన్నికల సమయంలో ప్రతపక్షాలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన కొందరు ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు కూడా లోలోపల తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వస్తే ఇప్పటికే టార్గెట్‌లో ఉన్న తమ పరిస్థితి ఏమిటంటూ ఆందోళన చెందుతున్నారని తెలుస్తోంది. ఐదేళ్లలో ఒక్క కేసు కూడా లేని వైసీపీ నాయకులకు ఎన్నికల సమయంలో తిప్పలు తప్పట్లేదు. కేసులు ఎదుర్కోవాల్సి వచ్చింది. కూటమి పార్టీలపై దాడులు, దౌర్జన్యాలు చేసిన కొందరు వైసీపీ నేతలపై బీజేపీ అభ్యర్థి పట్టుబట్టి కేసులు పెట్టించడంలో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తే తమను ఎక్కడ టార్గెట్ చేస్తారోనన్న భయం కూడా వారిలో నెలకొంది. ఈ భయమే ఆ నాయకులను నియోజకవర్గానికి దూరం చేసేలా చేసిందన్న చర్చ వినిపిస్తోంది.

మేకపోతు గాంభీర్యమేనా?

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తరువాత వైసీపీ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నది వారి మాటలను బట్టి స్పష్టమవుతోంది. ఏ నలుగురు కలిసినా తమ పార్టీనే గెలుస్తుందని చెబుతున్నారు. అంతర్గత చర్చల్లో మాత్రం ఓటమిని అంగీకరిస్తూ భవిష్యత్తులో తమ పరిస్థితి ఏమిటంటూ వారికవారే ప్రశ్నలు వేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ అరాచకాలు చేశామనీ, అధికారం మారితే కూటమి ప్రభుత్వం తమ పంథానే అవలంబిస్తే తమ పని అయిపోయినట్టేనని భయపడిపోతున్నారు. పాలకపక్షం మారితే కొన్నాళ్లపాటు నియోజకవర్గానికి దూరంగా ఉండటమే ఉత్తమమని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరు వైసీపీ నాయకులైతే.. కూటమి వర్గీయులతో లోలోపల చర్చలు, రాజీ ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. దందాలు, దౌర్జన్యాల్లో తమ ప్రమేయం లేదని చెప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ వినిపిస్తోంది.



తూచ్..!

- బెట్టింగ్ కాన్సిల్
- వైసీపీ గెలుపుపై పందెంవేసిన వారు వెనకడుగు
- డబ్బు వెనక్కివ్వాలని పట్టు



కదిరి, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు వరకు వైసీపీ వర్గీయుల్లో గెలుపుపై పూర్తి ధీమా ఉండేది. దీంతో రూ.కోట్లలో బెట్టింగ్‌లు వేశారు. పోలింగ్‌కు జనం పోటెత్తారు. వైసీపీ పాలనపై వ్యతిరేకతకు ఇది నిదర్శనమన్న విశ్లేషణలు వినిపించాయి. దీంతో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ వేసిన వారిలో అయోమయం ఏర్పడింది. రోజురోజుకీ పరిస్థితులు కూటమికి అనుకూలంగా మారాయి. ఎగ్జిట్ పోల్స్ కూటమికి పట్టం కట్టడంతో వైసీపీపై బెట్టింగ్ వేసిన వారు పూర్తిగా డీలాపడ్డారు. తమ డబ్బు పోయినట్లేనన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ వద్దంటూ క్యాన్సిల్ చేసేందుకు ఉపక్రమించారు. తాము బెట్టింగ్ రద్దు చేసుకుంటామనీ, డబ్బు వెనక్కివ్వాలని పట్టుబడుతున్నారు. గాండ్లపెంట మండలంలో వైసీపీ గెలుస్తుందని ఆ పార్టీ నాయకుడొకరు రూ.3 లక్షలు బెట్టింగ్ వేసినట్లు తెలిసింది. ఎగ్జిట్ పోల్స్‌లో టీడీపీకి అనుకూలంగా ఫలితాలు వెలువడడంతో ఆ నాయకుడు యూటర్న్ తీసుకున్నట్లు సమాచారం. తాను బెట్టింగ్ వేయలేదనీ, డబ్బు వెనక్కివ్వాలని కోరినట్లు తెలిసింది. నియోజకవర్గంలోని మరో రెండు మండలాల్లో ఇదే తరహాలో బెట్టింగ్ డబ్బు వెనక్కి తీసుకున్నట్లు తెలిసింది. వైసీపీపై బెట్టింగ్ వేసిన వారు తీవ్ర ఆవేదనలో ఉన్నారు.

మేఘ గర్జన

- ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- నీట మునిగిన అరటి, పత్తి పంటలు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు

కొళగానహళ్లి వద్ద నీట మునిగిన పత్తిపంట



నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో వానలు దంచికొట్టాయి. పలు మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైతులు సాగు చేసిన అరటి, మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. వానలకు ఈదురు గాలులు తోడవడంతో పలు చోట్ల చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ముంగారు వానలు మురిపిస్తుండటంతో అన్నదాతలు ఆనందంగా సేద్యపు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

వేదవతి హగరి పరవళ్లు



వంతెనపై నుంచి పారుతున్న వేదవతి హగరి నది

బొమ్మనహాళ్: భారీ వర్షాలకు మండ లంలో వాగులు, వంకలు వేదావతి హగరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వేదవతి హగరికి భారీగా వరదనీరు రావడంతో ఉ ద్దేహాళ్ గ్రామం వద్ద వంతెనపై వరదనీరు పారాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి హెచ్చెల్సీ ప్రధాన కాలువ 119/400 కి.మీ. వద్ద యూటీ అండర్ టెన్నల్ చానల్‌కు గండిపడింది. దీంతో కాలువలో నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించాయి. కొళగానహళ్లి వద్ద కబ్బాలివంక భారీ వరదనీరుతో ఉధృతంగా ప్రవహించింది. మండలంలో 91 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలంలోని ఉద్దేహాళ్, గౌనూరు, రంగాపురం క్యాంపు, కొళగానహళ్లి తదితర గ్రామాలలో సాగైన పత్తి, మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బతిన్నాయి.

కణేకల్లు: మండలంలో ఆదివారం రాత్రి 80 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. వేదవతి హగరి ఉధృతికి కణేకల్లు - ఉరవకొండ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఇంకా.. ఐదు రోజులు వానలు!

బుక్కరాయసముద్రం: నైరుతి పవనాలు రాయలసీమకు తాకాయి. దీని ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల రానున్న 5 రోజులు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకలకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. ఆదివారం ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదు అవుతున్న విషయాన్ని ఐఎండీ వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. గత ఏడాది కంటే నైరుతి పవనాలు అనుకున్న సమయం కంటే మూడు రోజులు ముందే వచ్చాయని వాతావరణ నిపుణులు తెలిపారు.

పెద్దవడుగూరులో భారీ వర్షం



పొంగిపొర్లుతున్న పందులవాగు

పెద్దవడుగూరు: మండలంలో ఆదివారం రాత్రి ఉరుము లు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలకేంద్రంలోని పందులవాగు ఉధృతంగా ప్రవహించింది. మండలంలో 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వీధులన్నీ జలమయం..



రోడ్డుపై పారుతున్న వర్షపునీరు

కళ్యాణదుర్గం: పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రధా న వీధులన్నీ జలమ య మయ్యాయి. రూరల్ ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన టమోటా, కర్బూజా, కలింగర పంటలు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. కంబదూరు మండలం జల్లిపల్లిలో కోతకొచ్చిన కర్బూజ, కలింగర పంటలు భారీ స్థాయిలో దెబ్బతిన్నాయి.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

పామిడి: గాలి వాన దెబ్బకు పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డు, బీసీసీ రోడ్డులలో విద్యుత్ తీగలు తెగిపోయాయి. గుత్తిరోడ్డులోని సబ్ స్టేషన్ ఎదురుగా ఓ చెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభం నేలకూలింది. దీంతో పట్టణంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. మండల పరిషత్ కార్యాలయంలో చెట్టు నేలకూలడంతో గేటు దిమ్మలు ఒరిగాయి.



పామిడిలో నేలకూలిన విద్యుత్ స్తంభం

పండమేరు పరవళ్లు...

రాప్తాడు: భారీ వర్షానికి పండమేరు వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. రాప్తాడు మండలంతో పాటూ పండమేరు వంక పైతట్టు ప్రాంతంతో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో పండమేరు వంకలోని చెక్‌డ్యాంలు నీటితో నిండి నీరు దిగువకు ప్రవహిస్తోంది. సోమవారం ఉదయంకు వర్షపు నీరు రాప్తాడుకు చేరుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొదటి సారి రాప్తాడులో పండమేరు వంక ప్రవహించడంతో సర్పంచ్ సాకే తిరుపాలు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సోమవారం గంగపూజ నిర్వహించారు.



పండమేటి రాయుడి ఆలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

నీటమునిగిన అరటి మొక్కలు



కనగానపల్లి రైతు బట్టానాగభూషణం పొలంలో నీట మునిగిన అరటిమొక్కలు

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలంలోని ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కనగానపల్లి, ముత్తవకుంట్ల, తల్లిమడుగులు, ఏలకుంట్ల, తగరకుంట, బద్దలాపురం తదితరగ్రామాల్లో వంకలు, వాగులు, చెక్‌డ్యాంలు పొంగిపోర్లాయి. కనగానపల్లిలో రైతు బట్టా నాగభూషణం 12 ఎకరాల్లో సాగుచేసిన అరటిమొక్కలు నీటమునిగాయి. మండలవ్యాప్తంగా 43.2మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చెరువులకు జలకళ

బెళుగుప్ప: ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఆదివారం అర్ధరాత్రి నుంచి కురవడంతో మండలంలోని పలు చెరువులకు జలకళ వచ్చింది. మండలంలో 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప కల్వర్టుపై నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శ్రీరంగాపురం, బెళుగుప్ప మంగోటి, నాగుల చెరువులకు భారీగా వర్షపు నీరు చేరింది. నీటి ఉధృతికి బెళుగుప్ప వద్ద పెద్దవంక కల్వర్టు దెబ్బతింది.



బెళుగుప్ప సమీపంలో పెద్దవంక కల్వర్టుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

బుక్కరాయసముద్రం చెరువులోకి చేరిన నీరు...



బీకేఎస్ చెరువులోకి వస్తున్న నీరు

బుక్కరాయ సముద్రం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గాలి, వాన దాటికి పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షానికి బుక్కరాయసముద్రం చెరువులోకి నీరు చేరుతోంది.

అనంతపురంరూరల్: మండలంలోని మన్నీల, కందుకూరు, క్రిష్ణంరెడ్డిపల్లి, చియ్యేడు, ఉప్పరపల్లి ప్రాంతాల్లో పదును వర్షం కురిసింది. అలాగే ఆలమూరు, చిన్నంపల్లి, కామారుపల్లి, కురుంటు, కొడిమి, నరసనేకుంట ప్రాంతాల్లో ఓ మోస్తరు వాన పడింది. మండలంలో 20.2మీ.మీ వర్షం పాతం నమోదైంది.

ఆగస్టులో జిల్లాకు హంద్రీనీవా నీరు: ఎస్ఈ



రిజర్వాయర్ల గేట్లు పరిశీలిస్తున్న ఎస్ఈ దేసేనాయక్, ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: జిల్లాకు ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలవకు నీరు వచ్చే అవకాశం ఉందని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్ తెలిపారు. రెండు రోజులు జిల్లాలో హెచ్ఎన్ఎస్ఎస్ పరిధిలోని జీడిపల్లి, చెర్లోపల్లి, మారాల, గొల్లపల్లి రిజర్వాయర్లను పరిశీలించినట్లు ఎస్ఈ తెలిపారు. శ్రీశైలం డ్యాం నుంచి గతేడాది కాలువకు 21 టీఎంసీలు నీరు వదలగా, జిల్లాకు 17 టీఎంసీలు చేరిందన్నారు. 4 టీఎంసీల నీరు భూమిలోకి ఇంకిపోయిందన్నారు. హంద్రీనీవా కాలువతో పాటు రిజర్వాయర్ల పటిష్టత, గేట్ల నాణ్యతను పరిశీలించి ప్రభుత్వానికి త్వరలో నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు. కాలువలు, రిజర్వాయర్ల నిర్వహణకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా నీటి విడుదలలోపు కాలవలు, రిజర్వాయర్లు, గేట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈసారి సాధ్యమైనంతవరకు శ్రీశైలం డ్యాంనుంచి అధికంగా జిల్లాకు నీటిని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఈఈ మురళి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, జూన్ 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 720 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

7 నుంచి పాలిసెట్ వెబ్ ఆప్షన్లు

అనంతపురం సెంట్రల్, జూన్ 3: పాలిసెట్‌లో అర్హతసాధించి కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు 7 నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని పాలిసెట్ కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కౌన్సెలింగ్ తేదీలను వాయిదా వేసినట్లు స్టేట్ కన్వీనర్ నాగరాణి ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ 6న, వెబ్ ఆప్షన్లు 7న, సీట్ల కేటాయింపు 13న, సెల్ఫ్ రిపోర్టింగ్ 14న ప్రారంభ మౌతునాయని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని కోరారు.

అయోధ్యలో 'పురం' కళాకారుల ప్రతిభ

- విద్యాధరికి కళావిభూషణ్ పురస్కారం

హిందూపురం అర్బన్, జూన్ 3: అయోధ్యలో సత్యసాయి జిల్లా హిందూపురం నృత్య కళాకారులు ప్రతిభ చాటారు. ఆదివారం అయోధ్యలో రామసేతు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో హిందూపురం నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, కథకళి, మోహినీ అట్టం, ఫోక్ డ్యాన్స్‌లకు 75 బృందాలు వచ్చాయి. హిందూపురం నుంచి గతిస్వం కూచుపూడి కళాక్షేత్రం సమూహం నుంచి 10 మంది పాల్గొన్నారు. పోటీల్లో సబ్‌జూనియర్స్ గ్రీష్మ, సమన్విత లకు మొదటి స్థానం రాగా మోక్షిత, జూనియర్స్‌లో స్కందశ్రీ, శ్రీకృతి మోక్ష మొదటి స్థానంలో రెఖ, మధురిమ రెండవ స్థానంలో నిలిచారు. అలాగే సీనియర్ విభాగంలో ప్రవల్లిక మొదటి స్థానంలో నిలువగా, శ్రేయ రెండో స్థానంలో నిలిచింది. మోదటి మూడు స్థానాల్లో హిందూపురం కళాకారులు ప్రతిభ చాటినందుకు గతిస్త్వం గురువు దుర్గా విద్యాధరికి యూపీ ప్రభుత్వం రామసేతు అర్గనైజేషన్ వారు కళావిభూషణ్ అవార్డును ప్రదానం చేశారు. ప్రతిభా కళాకారులకు ధ్రువపత్రాలు, మెమెంటోలు అందించి అభినందించారు.



ప్రశంసా పత్రాలతో నృత్యకళాకారిణులు

పోలింగ్ ముగిసిందనే జీతాలివ్వలేదా?

- గత నెలలో ఒకటో తేదీనే వేతనాలు
- ఈనెల మరిచిన ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్, జూన్ 3: ఐదేళ్లుగా జీతాలకోసం ఎదురుచూసేట్టు చేసిన వైసీపీ ప్రభుత్వం.. గత మే నెల మాత్రం ఒకటో తేదీనే ఠంచనుగా వేతనాలు జమచేసింది. అయితే ఈనెల మాత్రం మరిచిపోయిందని జేఎన్‌టీయూ ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఓటు వేసేశారు, ఎన్నికలు ముగిసిపోయాయని ఇక వారితో పనేంటని ప్రభుత్వం జీతాలివ్వలేదని మండిపడుతున్నాయి. ఏరు దాటి తెప్పను తగలేసినట్లుగా ప్రభుత్వ తీరు మారిందని వాపోతున్నాయి. గల్లాపెట్టె ఖాళీచేసి అప్పులు తీసుకువచ్చిన తరువాత తమ జీతాలు జమజేయడం అలవాటుగా చేసుకున్న ప్రభుత్వం ఎన్నికల అనంతరం చేతులెత్తేసిందని మండిపడుతున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఏర్పడబోయే ప్రభుత్వమే జీతాలు ఇచ్చుకుంటుందన్న భావనతో విస్మరిస్తోందని అంటున్నాయి. రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలివ్వడం అలవాటుచేసుకున్న వైసీపీ ప్రభుత్వం.. మే నెల మాత్రమే ఒకటో తేదీన జమచేయడం ఇందుకు నిదర్శనమంటున్నాయి.

అధికార ముసుగు...



జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు కొంతమంది వైసీపీకి భజనపరులుగా మారిపోయి తమ సంక్షేమాన్ని విస్మరించారని ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. జీతాలివ్వాలని కోరినప్పుడల్లా ట్రెజరీలో పెండింగ్, సీఎఫ్ఎంఎస్‌లో ఉన్నాయి, రిజర్వ్‌బ్యాంక్ ఓకే చేయాలి ఇలా అనేక సాకులు చెప్పారంటూ గుర్తుచేసుకుంటున్నాయి. అదే అధికారులే.. మే నెలలో జీతాల్వికపోతే ఉద్యోగులు ఓటు ద్వారా వారి ప్రతాపాన్ని చూపుతారని ట్రెజరీ, సీఎఫ్ఎం శాఖలతో మాట్లాడి వేతనాలు జమ చేయించారని పేర్కొంటున్నాయి. అదే చొరవ గతంలోనూ, ప్రస్తుతం ఎందుకు చూపలేకపోయారని ప్రశ్నిస్తున్నాయి. ఉద్యోగుల సంక్షేమం కన్నా వారి పదవులే ముఖ్యమన్న రీతిలో వ్యహరించారని మండిపడుతున్నాయి.

జిల్లా విడిచి వెళ్లండి..!

- వైసీపీ, టీడీపీ వర్గీయులకు నోటీసులు
- కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా బహిష్కరణ

అనంతపురం క్రైం, జూన్ 3: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీడీపీ, వైసీపీ వర్గీయులతోపాటు రౌడీషీట్లు ఉన్న పలువురిని పోలీసులు జిల్లా నుంచి బహిష్కరించారు. జాబితాను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద మందికి పైగా రౌడీషీటర్లకు సోమవారం నోటీసులు ఇచ్చారు. ఈనెల 25వరకు జిల్లాలోకి ప్రవేశించకూడదని ఆదేశించారు. అత్యధికంగా తాడిపత్రి నియోజకవర్గంలో 60 మందిని జిల్లా నుంచి బహిష్కరణ చేసినట్లు సమాచారం. అనంతపురంలో నగరంలో ముగ్గురిని బహిష్కరించారు. అనంతపురం అర్బన్ పరిధిలో రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, చంద్రదండు వ్యవస్థాపకులు ప్రకాష్‌నాయుడు, రాప్తాడు నియోజకవర్గంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, వైసీపీ నాయకుడు, తోపుదుర్తి ఎంపీటీసీ పాలచర్ల పోతులయ్య, తోపుదుర్తి ఓబిరెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఇద్దరిని బహిష్కరించారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి 35 మందిని బహిష్కరించారు. వీరిలో కదిరి నియోజకవర్గానికి చెందినవారు నలుగురు ఉన్నారు. వైసీపీ కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి పూల శ్రీనివాసరెడ్డితో, పార్టీ నాయకుడు అల్తాఫ్‌ను జిల్లా నుంచి బహిష్కరించారు. టీడీపీ కదిరి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మాజీ ఎంపీపీ విజయ్‌రెడ్డిని జిల్లా నుంచి బహిష్కరించారు.

డీఐజీ పర్యవేక్షణలో తాడిపత్రి

తాడిపత్రి పట్టణంలో ఎన్నికల అల్లర్ల నేపథ్యంలో ఆ నియోజకవర్గంపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. డీఐజీ స్థాయి అధికారి రాహుల్ దేవ్‌శర్మను తాడిపత్రి నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆయన విధుల్లో చేరి, అక్కడి పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

ఉదయమే వచ్చేయండి..

కౌంటింగ్ నేపథ్యంలో గొడవలు జరగకుండా చూసుకునేందుకు పోలీసులు తంటాలు పడుతున్నారు. 'మంగళవారం ఉదయం ఆరు గంటలకే పోలీస్ స్టేషన్‌కు వచ్చేండి. టిఫిన్, భోజనం మేమే పెడతాం' అని వివిధ పార్టీల నాయకులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి కనీసం ఇద్దరు ముఖ్య నాయకులకు ఇలాంటి సూచనలు వెళ్లాయని తెలిసింది.

శ్రీసత్యసాయి జిల్లా నుంచి 35 మంది...

పుట్టపర్తి రూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడ్డ వ్యక్తులను నెలరోజులపాటు జిల్లా బహిష్కరణ చేస్తూ ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలు జారీచేశారు. బహిష్కరణకు గురైన వారిలో అమరనాథరెడ్డి, ముకుందనాయుడు, బడముద్దల రంగయ్య, మహల్ అల్తాఫ్ ఖాన్, ఏటూరి శ్రీనివాసులు, వెంకటరమణ, ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, పూల శ్రీనివాసులరెడ్డి, పూల విజయ్‌కుమార్‌రెడ్డి, పందిపర్తి రామకృష్ణ, మొరిమిశెట్టి సురేష్, జ్వాలా గణేష్‌కుమార్ రెడ్డి, మట్టా చంద్రశేఖర్, బోయ శంకర్, బండిరవి, మీనుగ నాగరాజు, పొట్టి నరేంద్ర, మోటా రవీంద్ర, కమ్మశివశంకర్, దండు ఓబులేసు, ముత్యాలప్ప, తలారి చంద్రమోహన్, బోయ లక్ష్మానారాయణ, డైమండ్ ఇర్ఫాన్, శ్రీనివాసులు, హరి చెర్లోపలి, హరిజన బాబు, కొండకమర్ల నాగేంద్ర, ఎస్ శివ, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణరావు, బోయ రామాంజనేయులు, మారెప్ప, సాయికుమార్ ఉన్నారు.

రేయ్ రాజేష్.. లేవరా..

- ఈతకు వెళ్లి విద్యార్థి మృతి
- కన్నీరుమున్నీరైన తల్లి

'ఒరే రాజేష్.. ఒక్కసారి పైకిలేవరా. నన్ను చూడరా..! కాలేజీకి వారంలో వెళ్లాలంటివి.. ఇప్పుడే వస్తానని బయటకి పోతివి గదరా... పైకి లేవరా' అంటూ ఆ తల్లి గుండెలు బాదుకుంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. నార్పల పట్టణంలోని కొండంక వీధికి చెందిన విద్యార్థి రాజేష్(17) సోమవారం బావిలో ఈతకు వెళ్లి మృతి చెందాడు. మెకానిక్ గాండ్ల లక్ష్మీపతి, సుహాసిని దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రాజేష్ అనంతపురంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. త్వరలో తరగతులు మొదలైతాయని, కాలేజీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాడు. ఎప్పటిలాగే లక్ష్మీపతి తోటకు వెళ్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చేశాడు. దీంతో ఎలాగైనా ఈతకు వెళ్లాలని తమ్ముడితో కలసి రాజేష్ తోటలోని బావి వద్దకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నెమ్మదిగా గట్టును పట్టుకుని బావిలో దిగడానికి ప్రయత్నిస్తూ.. జారి బావిలో పడ్డాడు. నీళ్లలో మునిగిపోయి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు రాజేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. రాజేష్ తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

\- నార్పల



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, ఇన్‌సెట్‌లో రాజేశ్ (ఫైల్)

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య



రూపా నారాయణ స్వామి (ఫైల్)

యాడికి, జూన్3: అప్పుల బాధతో చేనేత కార్మికుడు రూపా నారాయణస్వామి (55) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు యాడికిలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన నారాయణస్వామి చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు భార్య లక్ష్మీదేవి చేనేత మగ్గానికి సంబంధించిన అచ్చులు అతికించే పనికి వెళ్లేది. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. ఇటీవల కాలంలో కొత్త ఇంటిని నిర్మించుకున్నారు. రూ.4 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు తెలిపారు. పట్టు చీరల విక్రయాలకు అన్‌సీజన్ కావడంతో మగ్గం పనులు సరిగా జరగడం లేదని తెలిపారు. అచ్చులు అతికే పనులు కూడా పూర్తిగా తగ్గిపోయాయని తెలిపారు. నారాయణస్వామికి అప్పులు ఉండడం, ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మద్యం తాగేవాడని తెలిపారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బాధపడుతుండేవాడన్నారు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చేనేత మగ్గానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. నారాయణస్వామి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోడకూలి విద్యార్థి మృతి



అఖిల్ (ఫైల్)

ఆత్మకూరు, జూన్ 3: మండల కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు గోడకూలి బోయ అఖిల్ (18) అనే విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి వద్ద ఎదురుగా ఉన్న గోడ సమీపాన రెండురోజులు క్రితం కొత్తగా కొనుగోలు చేసి తెచ్చిన ఎద్దులను శుభ్రం చేస్తుండగా గొడకూలిపోయింది. అక్కడే ఉన్న అఖిల్‌పై గోడ పడటంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతపురంలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. సెలవులు కావడంతో తండ్రికి సాయంగా వ్యవసాయ పనులు చేసుకొంటున్నాడు. ప్రమాదంలో అతనితో పాటు రూ.లక్ష విలువ చేసే గాయపడింది. రెండు రోజులుక్రితం రూ.2 లక్షలు వెచ్చించి కోనుగోలు చేసిన ఎద్దులతో పాటు కొడుకు మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లితండ్రులు అంజి, లక్ష్మీదేవి, కూతుళ్ల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలి



కౌంటింగ్ ఏజెంట్లతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలంటూ మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి సూచించారు. హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో సోమవారం ఆయన కౌంటింగ్‌లో పాల్గొ నే ఏజెంట్లకు పలు సూ చనలు చేశారు. ఏజెంట్లు గుర్తింపు కార్డుతో పాటు ఎన్నికల అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలను వెంట తీసుకుని మంగళవారం ఉదయం 5:30 గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపులో ఈవీఎంలలో సమస్యలు వచ్చిన వెంటనే రిటర్నింగ్ అధికారి, ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉండకూడదని సూచించారు. కౌంటింగ్‌లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, అనవసరమైన ఆవేశాలకు, గొడవలకు అవకాశం ఇవ్వవద్దని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని పల్లె ఏజెంట్లకు సూచనలు చేశారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



కరాటే విద్యార్థులతో కందికుంట వెంకటప్రసాద్

కదిరి అర్బన్, జూన్ 3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. కరాటే అసోషియేషన్ ఇండియా ఆధ్వర్యంలో నెలరోజుల నుంచి పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మాస్టర్ అక్బర్ అలీ సమక్షంలో పలువురు విద్యార్థులు కరాటేపై శిక్షణ తీసుకున్నారు. ఆ విద్యార్థులకు సోమవారం కందికుంట వెంకటప్రసాద్ తన నివాసంలో ధృవీకరణ పత్రాలు, బెల్టులు అందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కరాటేతో ఉత్సాహం, ఉల్లాసంతోపాటు శరీరక ధారుడ్యం కలుగుతుందని తెలిపారు.

వేపరాల ఆరోగ్య కేంద్రానికి తాళం

బిల్లు చెల్లించనందుకే: కాంట్రాక్టర్



ఆరోగ్య కేంద్రానికి తాళం వేసిన దృశ్యం

గాండ్లపెంట, జూన్ 3: బిల్లులు చెల్లించకపోవడంతో మండలంలోని వేపరాల ఆరోగ్యకేంద్రానికి కాంట్రాక్టర్ గత నాలుగు రోజుల క్రితం తాళం వేశారని, అయితే ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదని వేపరాల పంచాయతీ ప్రజలు వాపోతున్నారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను వైసీపీకి చెందిన కాంట్రాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి చేయించారు. అయితే సోమవారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను పూర్తిచేసి భవనాన్ని ఎంపీడీఓకు అప్పగించామని, ఎంపీడీఓ బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని, నిర్మాణం కోసం అప్పులు చేశానని తెలిపారు. బిల్లు ఇవ్వాలని పలుమార్లు కోరినా ఎంపీడీఓ పట్టించుకోలేదన్నారు. దీంతో చేసేదిలేక గత శుక్రవారం ఆరోగ్యకేంద్రంలోని సిబ్బందిని బయటకు పంపి తాళం వేసినట్లు తెలిపారు. సీహెచ్‌ఓ రాజేశ్వర్, ఏఎన్ఎంలు బయటనే ఉంటున్నారన్నారు. ఈవిషయంపై వైద్యులు మహేశ్వర్, మారుతీని వివరణ కోరగా కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడంతో, భవనానికి తాళం వేశారని, ఈవిషయాన్ని ఎంపీడీఓకుతెలియజేశామని అన్నారు. ఎంపీడీఓ రామానాయక్‌ను వివరణ కోరగా ఎన్నికల ఫలితాల తరువాత ఈవిషయాన్ని పరిశీలిస్తామని సమాధానమిచ్చారు.

కలుషిత ఆహారం తిని నలుగురికి అస్వస్థత



108 వాహనంలో ఆస్పత్రికి వెళుతున్న బాధితులు

ముదిగుబ్బ, జూన్ 3: మండలంలోని మంగళమడక గ్రామంలో కలుషిత ఆహారం తిని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అస్వస్థతకు గురైనట్లు 108 సిబ్బంది తెలిపారు. వివరాల్లోకెళ్తే.. మంగళమడక గ్రామానికి చెందిన జయరాజు కుటుంబం ఆదివారం ఇంట్లో వండుకున్న ఆహారం తిన్నారు. అయితే సోమవారం తెల్లవారుజాము నుంచి జయరాజు, భార్య రామచంద్రమ్మ, కుమార్తె పద్మావతి, మనవడు నిఖిల్‌కు వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో ముదిగుబ్బ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

కందికుంట విజయం కోసం పూజలు



భైరవేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ నాయకులు

తనకల్లు, జూన్ 3: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు మొండెం వెంకటరెడ్డి, కావడి ప్రవీణ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లచెరువు మండలం అల్లుగుండు సమీపంలో ఉన్న భైరవేశ్వర ఆలయంలో సోమవారం వారు ప్రత్యేక పూజలు చేయించి కందికుంట భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరారు.

విద్యుదాఘాతంతో 8 గొర్రెల మృతి



గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న గ్రామస్థులు

తనకల్లు, జూన్ 3: మండలకేంద్రంలోని ఇందిరానగర్‌లో మౌలాలికి చెందిన 8 గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. దీంతో రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు సోమవారం వాపోయాడు. ప్రతిరోజు లాగానే ఆదివారం ఉదయం గొర్రెలను సమీప పొలాల్లోకి మేతకు తీసుకెళ్లానని, సాయంత్రం ఇంటికి తోలుకొచ్చి షెడ్‌లోకి తోలానని తెలిపారు. అయితే రాత్రి సమయంలో గాలివానకు విద్యుత్ వైరు తెగి షెడ్ పైన పడిందని, షెడ్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి 8గొర్రెలు మృతిచెందాయని వాపోయాడు. జీవనాధారం కోల్పోయానని కంటతడి పెట్టాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ప్రభుత్వ బడుల దశ మారేదెన్నడో?

- శిథిలావస్థలో పాఠశాల భవనాలు
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- దశాబ్దాలుగా.. ఇదే దుస్థితి
- ఈ ఏడాదీ సమస్యల నడుమే పునఃప్రారంభం కానున్న పాఠశాలలు



శిథిలావస్థకు చేరుకున్న వీరఓబునపల్లి పాఠశాల భవనం



వర్షానికి నెమ్ము తీసుకున్న తరగతి గది గోడలు



గది పైకప్పునకు పెచ్చులూడిన కడ్డీలు

ఓబుళదేవరచెరువు, జూన్ 3: దశాబ్దాలు గడుస్తున్నా.. ఎన్నోప్రభుత్వాలు మారుతున్నా.. ప్రభుత్వ పాఠశాలల దశ మాత్రం మారడం లేదు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని, అన్నిసౌకర్యాలు కల్పిస్తామని పాలకులు చెబుతున్నారే కానీ, ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. దీంతో నిర్వహణ సరిగా లేక మండలంలో పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. అలాగే కనీస వసతులు కరువయ్యాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా 78 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 62 ప్రాథమిక, 7 ఉన్నతపాఠశాలల, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో వీర ఓబునపల్లి, జంబులవాండ్లపల్లి, చింతమానుపల్లి, పెద్దసానివారిపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. తరచూ పెచ్చులూడుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వెంకటాపురం పంచాయతీ వీరఓబునపల్లి ప్రభుత్వ పాఠశాలలో రెండు తరగతి గదులున్నాయి. వాటిలో ఒక గది పూర్తిగా దెబ్బతింది. పైకప్పు పెచ్చులూడి కడ్డీలు కన్పిస్తున్నాయి. వర్షం వస్తే మొత్తం కారుతోంది. చేసేదిలేక విద్యార్థులందరూ మరొక గదిలో ఇరుకుగా కూర్చొని చదువు నేర్చుకోవాల్సి వస్తోంది. పాఠశాలల దుస్థితిపై గతంలో అధికారులు, నాయకుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని, ఫలితం లేకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు, ఉపాధ్యాయలు వాపోతున్నారు.

ఈ ఏడాది కూడా తిప్పలు తప్పేలా లేవు..

పాఠశాలల భవనాలు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా, ఎవరూ మరమ్మతులు చేయించలేదు. దీంతో ఈ ఏడాది కూడా విద్యార్థులు సమస్యల బడుల్లోనే విద్యాబోధన కొనసాగించాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభం అవుతుండడంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సమస్యలు తప్పేలా లేవు. నాడు నేడు కింద మండలంలో కొన్ని పాఠశాలలు ఎంపిక కాలేదు.

చాలీచాలని నిధులు..

పాఠశాలల అభివృద్ధికి నిధులు నామమాత్రంగానే విడుదలవుతున్నాయి. వీటితో చిన్నపాటి మరమ్మతులు మినహా, పెద్ద పెద్ద పనులు చేయించలేని పరిస్థితి. సరిపడా నిధులు రాకపోవడంతో ఉన్నవాటితోనే సర్దుకోవాల్సి వస్తోంది. కొన్ని పాఠశాలలకు నిధులు విడుదలైనా, అందులో సగం వినియోగించుకుని మిలిన వాటిని వేరే జిల్లాలకు మళ్లించారు.

మరమ్మతులపై దృష్టి సారించాలి



మా గ్రామంలో కొన్నేళ్లుగా దెబ్బతిన్న పాఠశాల గదుల్లోనే విద్యార్థులు చదువుకుంటున్నారు. గదులను మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎవరూ పట్టించుకోలేదు. ఉన్న రెండు గదుల్లో ఓగది పూర్తిగా దెబ్బతినడంతో మరో గదిలో విద్యాబోధన సాగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పాఠశాల భవనాన్ని మరమ్మతు చేయించాలి.

-వేణుగోపాల్‌రెడ్డి, వీరఓబునపల్లి

ఇంకెన్నాళ్లీకష్టాలు..?



మా గ్రామంలో పాఠశాల గదులు దెబ్బతినడంతో దశాబ్దాలుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకెనాళ్లు ఈ తిప్పలు పడాలి. వచ్చిన కొద్దిపాటి నిధులతో వంటగదిని మరమ్మతు చేశారు. ఇప్పటికైనా నాడు నేడు కింద అదనంగా మరిన్ని నిధులు మంజూరు చేసి పాఠశాల గదులను మరమ్మతు చేయించాలి.

-మూడే హరికృష్ణనాయక్, వీర ఓబునపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండల వ్యాప్తంగా దెబ్బతిన్న పాఠశాలల భవనాల పరిస్థితులపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈఏడాది కూడా మరోమారు తీసుకెళ్లి, అదనపు నిధులు తెప్పించి దెబ్బతిన్నపాఠశాలల మరమ్మతులకు కృషి చేస్తాం.

- సురేష్, ఎంఈఓ-1

పింఛన్‌దారులతో బ్యాంకులు కిటకిట





గాండ్లపెంటలో బ్యాంకు వద్ద వేచివున్న వృద్ధులు, రద్దీగా నల్లమాడలోని ఏపీజీబీ

- పింఛన్ సొమ్ము డ్రా చేసుకునేందుకు భారీగా రాక
- గంటలకొద్దీ వృద్ధుల పడిగాపులు

గాండ్లపెంట, జూన్ 3: వృద్ధులకు ప్రతినెలా ఇళ్ల వద్దకు వెళ్లి అందించే పింఛన్ సొమ్మును గత మూడునెలలనుంచి ఎన్నికల సందర్భంగా బ్యాంకుఖాతాల్లో జమ చేయడం జరుగుతోంది. ఈ క్రమంలో ఈ నెల కూడా ఖాతాల్లోనే జమ చేశారు. దీంతో వాటిని డ్రా చేసుకోవడానికి సోమవారం పింఛన్‌దారులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాశారు. మండలవ్యాప్తంగా వివిధ రకాల పింఛన్‌దారులు 4,324మంది ఉన్నారు. ఇందులో దివ్యాంగులకు, పండు వృద్ధులకు ఇళ్లవద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్మును అందజేయాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇవ్వడంతో.. 1,440మందికి ఇళ్ల వద్దనే పంపిణీ చేశారు. మిగిలిన వారికి ఖాతాల్లో జమ చేశారు. 1వ తేదీన పింఛన్ సొమ్ము జమఅయింది. 2వతేదీ ఆదివారం కావడంతో బ్యాంకులకు సెలవు. దీంతో సోమవారం వాటిని డ్రా చేసుకునేందుకు పింఛన్‌దారులు మండలకేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్దకు భారీగా వచ్చారు. ఓ పక్క రుణాల రెన్యూవల్ కోసం రైతులు కూడా పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో బ్యాంకు కిటకిటలాడింది. వృద్ధులు పింఛన్‌కోసం చాలాసేపు పడిగాపులు కాశారు. మరికొంతమంది వేలిముద్రలు పడక ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు గంటల కొద్దీ నిలబడలేక అసహనం వ్యక్తం చేశారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పింఛన్‌దారులతో కిటకిటలాడింది. కొంతమంది పింఛన్ డబ్బులు డ్రా చేసుకోవడానికి వస్తే.. మరికొందరు డబ్బులు పడ్డాయా లేదా అని చూసుకోవడానికి వచ్చారు. వృద్ధులతో పాటు మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం 3గంటల వరకు బ్యాంక్ కిటకిటలాడింది.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు: సీఐ

ధర్మవరం, జూన్ 3: పట్టణంలో ఎవరైనా అల్లర్లు సృష్టించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ సుబ్రమణ్యం హెచ్చరించారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుందని, దీంతో ఎక్కడైనా ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగించాలని చూస్తే వెంటనే ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రౌడీషీటర్లు, కిరాయి హంతకులు తదితరుల కదలికలపై కూడా నిఘా ఉంచామన్నారు. పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు అమల్లో ఉందన్నారు. ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండరాదని తెలిపారు. గెలిచిన వారు సభలు, సమావేశాలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. వీటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ప్రజలు గుంపులుగా ఉండరాదు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో సోమవారం సీఐ యతీంద్ర అదనపు బలగాలతో జన సంచారం ఎక్కువ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మంగళవారం కౌంటింగ్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 144సెక్షన్ అమల్లో ఉందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. మండలంలో 30పోలీస్ యాక్టు అమలులో ఉందని, కనుక ఎవరూ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, బాణసంచా కాల్చరాదని సూచించారు. ఎవరైనా గొడవలు పడితే చట్టపరమైన చర్యలు తీసుకొని వారిపై రౌడీ షీట్లు, జిల్లా బహిష్కరణ లాంటి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరి పే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన




కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌ఓలు

పుట్టపర్తి జూన్ 3: పుట్టపర్తి, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్‌కేంద్రాల ఏర్పాట్లను ఆయా రిటర్నింగ్ అధికారులు భాగ్యరేఖ, వెంకటశివరామిరెడ్డి సోమవారం రాత్రి పరిశీలించారు. చోళసముద్రం వద్ద నున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇద్దరు ఆర్‌ఓలు ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్‌ఓల వెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఈడీటీ నరసింహులు ఉన్నారు.

పక్కదారి పడుతున్న విత్తన వేరుశనగ

- కొరవడిన ఉన్నతాధికారుల నిఘా



వేపరాల ఆర్బీకే నుంచి ట్రాక్టర్‌లో తరలుతున్న విత్తన వేరుశనగ కాయలు

గాండ్లపెంట, జూన్ 3: ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందిస్తున్న విత్తన వేరుశనగ పక్కదారి పడుతున్నాయని, విషయం తెలిసినా అధికారులు పట్టించుకోలేదని మండలప్రజలు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సాగుకు 40శాతం సబ్సిడీతో రైతులకు విత్తన వేరుశనగ కాయలు అందిస్తోంది. అయితే విత్తన కాయలు నాసిరకంగా ఉండడంతో వాటిని విత్తనా.. దిగుబడి రాదని, చాలామంది రైతులు కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. ఇదే అదునుగా వేరుశనగ వ్యాపారులు రైతుల పేర్లతోనే వాటిని కొనుగోలు చేస్తూ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే విత్తన వేరుశనగ ఎలాంటి దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే మండలంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడంతో వేరుశనగ వ్యాపారులకు కలిసివస్తోంది. వ్యాపారులు ఆర్బీకేల్లో రైతుల పేర్ల మీదనే విత్తనకాయలు తీసుకుంటున్నారు. ఇందుకు వాటికి ఇవ్వాల్సిన డబ్బులతో పాటు రైతులకు అదనంగా ఒక పాస్‌పుస్తకానికి రూ.ఐదువందలు చెల్లిస్తున్నారు. ఇలా ప్రతి ఆర్బీకే వద్దకు వెళ్లి ఒక్కొక్క వ్యాపారి వంద బస్తాలకుపైగా ట్రాక్టర్లు, ఆటోల్లో వాటిని తరలిస్తున్నారు. ఇంతజరుగుతున్నా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. ఆర్బీకే సిబ్బందికి, వ్యాపారులకు లావాదేవీలున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వ్యాపారులకు సులువుగా కాయలు దొరుకుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీకాయలకు ఇస్తున్నసంచులను వ్యాపారులు మార్చుకుని కొన్నింటిని మార్కెట్‌కు, మరి కొన్నింటిని రీసైకిలింగ్‌కు పంపుతున్నారు. వేపరాల ఆర్బీకే నుంచి సోమవారం ఓట్రాక్టర్‌లో వందబస్తాలకు పైగా విత్తన వేరుశనకాయలను ఓమిల్లుకు వ్యాపారులు తరలించినట్లు ఆ గ్రామస్థులు చెబుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటున్నారు. దీనిపై ఏఓ లక్ష్మీప్రియను వివరణ అడగ్గా.. విషయం మా దృష్టికి రాలేదని, విచారణ చేసి సబ్సిడీ విత్తనకాయలు పక్కదారి పట్టకుండా చూస్తామని తెలిపారు.

కనగానపల్లిలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్, జూన్ 3: జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా కనగానపల్లిలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బత్తలపల్లి 29.2, తాడిమర్రి 28.4, గుడిబండ 23.2, రొళ్ల 22.2, నంబులపూలకుంట 19.2, కదిరి 18.2, నల్లచెరువు 15.2, ధర్మవరం 12.4, తనకల్లు 10.4, గాండ్లపెంట 10.0, నల్లమాడ 8.4, అమరాపురం 5.2, అగళి 4.4, ముదిగుబ్బ 3.2, అమడగూరు 2.0, రామగిరి 1.4, తలుపులలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు.

ఖరీఫ్ పంటలపై రైతులకు సూచనలు

గాండ్లపెంట, జూన్ 3: మండలంలోని కటారుపల్లి రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై ఏడీఏ సత్యనారాయణ, వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య, సూచనలు, సలహాలు అందించారు. ఖరీఫ్ పంటల సాగు కోసం తొలుత పొలంలో పశువుల ఎరువు చల్లాలని, తర్వాత లోతైన దుక్కులు చేసుకోవాలని అన్నారు. అనంతరం విత్తానాలు విత్తాలన్నారు. వేరుశనగకు విత్తన శుద్ధి తప్పకుండా చేయాలన్నారు. వేరుశనగ రైతులు జిప్సం వాడాలని, దాని ద్వారా నూనె శాతం పెరుగుతుందని సూచించారు. ఏఓ లక్ష్మీప్రియ, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

గుంపులుగా ఉండకూడదు: ఎస్‌ఐ

నంబులపూలకుంట, జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా మంగళవారం మండలంలో ప్రజలు ఎక్కడా కూడా గుంపులుగా ఉండకూడదని ఎస్‌ఐ శ్రీధర్ సూచించారు. విజయం సాధించిన వారి వర్గీయులు బాణసంచా కాల్చడం, డీజేలు పెట్టి శబ్దాలు చేయడం, ర్యాలీలు చేపట్టడం లాంటివి చేయరాదన్నారు. మండలకేంద్రంలోని పెడబల్లిరోడ్డులో సోమవారం ఆయన ప్రజలకు ఈ మేరకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక కాలనీల్లో పోలీసుల పర్యటన

బత్తలపల్లి, జూన్3: మండలకేంద్రంలోని సమస్యాత్మక కాలనీలలో సోమవారం ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంగళవారం ఓట్ల లెక్కింపు ఉందని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం ఎవరూ బాణసంచా కాల్చరాదన్నారు. ద్విచక్రవాహనాలను సైలెన్సర్ తొలగించి తిరగరాదన్నారు. ప్రత్యర్థి పార్టీ వారిని చూసి కేకలు, ఈలలు వేయరాదన్నారు. అలా చేస్తే కేసులు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

సైనికోద్యోగుల నుంచి 126 ఓట్లు

ధర్మవరంరూరల్, జూన్3: దేశంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనిక ఉద్యోగుల నుంచి 126 ఓట్లు పోస్టల్ ద్వారా వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి సోమవారం తెలిపారు. ఇప్పటి వరకు పోస్టల్ ద్వారా వచ్చిన వారి ఓట్లను ప్రత్యేక బాక్సులో వేసి పోలీసుల బందోబస్తు నడుమ చోళసముద్రంలోని కౌంటింగ్ కేంద్రానికి చేర్చినట్లు చెప్పారు. ఇంకా మంగళవారం వరకు వచ్చే అవకాశం ఉందని, మా కార్యాలయానికి రాగానే ప్రత్యేక వాహనంలో వాటిని నేరుగా కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని ఆయన పేర్కొన్నారు.

8న కంటివైద్యశిబిరం

ధర్మవరం, జూన్ 3: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 8వ తేదీన యువర్స్‌ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్ష,కార్యదర్శులు శీలానాగేంద్ర,జయరాం తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక స్వాతిక్లినిక్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యశిబిరంలో నిరుపేదలకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారన్నారు. కంటి చూపు మందగించిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, జూన్ 3: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గణిత శాస్త్రం సబ్జెక్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్రం బోధించడానికి (ఎంఎస్‌సీ) అర్హత కల్గిన వారు ఈనెల 10న కళాశాలలో ఉదయం 11గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9703151381 సంప్రదించాలన్నారు.

చెర్లోపల్లి రిజర్వాయర్ పరిశీలన

కదిరిఅర్బన్, జూన్ 3: మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్‌ను హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు సోమవారం పరిశీలించా రు. ఎస్ఈ దేశానాయక్ రి జర్వాయర్ వద్ద ఉన్న రెగ్యులేటర్ గేట్లను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో.. గేట్ల వ నీటీరును పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. డీఈ విశ్వనాథ్, ఏఈ పాండురంగ ఉన్నారు.

కోన మల్లేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



కోనమల్లేశ్వర స్వామిని తాకుతున్న సూర్యకిరణాలు

తాడిమర్రి, జూన్ 3: మండల సరిహద్దులోని కోనక్షేత్రంలో వెలసిన కోనమల్లేశ్వరస్వామిని సోమవారం ఉదయం 9:30 గంటల సమయంలో సూర్యకిరణాలు తాకినట్టు అర్చకుడు రాజశేఖర్‌శాస్త్రి తెలిపారు. ఉదయం పూజా కార్యక్రమాలు చేస్తుండగా దాదాపు రెండు నిమిషాల పాటుగా సూర్యకిరణాలు స్వామివారి మూలవిరాట్‌ను తాకాయన్నారు. అభిషేకాల తరువాత అలంకరణ పూర్తి చేసి మహామంగళహారతి ఇచ్చే సమయానికి సూర్యకిరణాలు తాకినట్టుగా అర్చకుడు పేర్కొన్నారు.

లేపాక్షి శిల్పకళ అమోఘం

గోవా ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్‌రాణే



దుర్గాదేవిని దర్శించుకుంటున్న గోవా మంత్రి

లేపాక్షి, జూన్ 3 : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన లేపాక్షిలోని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని గోవా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే అన్నారు. ఆయన సోమవారం లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభం సందర్శించారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గోవా బృందం ఆయన వెంట ఉన్నారు.

సీహెచ్‌సీలో ఎంఎల్‌సీల పరిశీలనకు అనుమతి

గోరంట్ల, జూన్ 3: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జూన్ 1వ తేదీ నుంచి మెడికల్ లీగల్ కేసులను పరిశీలించి, పోస్టుమార్టం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డీసీ హెచ్ఎస్ రవిపాల్ ఆదేశాలు జారీ చేశారు. గత నెల 21న మాజీ వలంటీర్ హత్యకేసులో అరెస్టు అయిన ఆరుగురు నిందితులకు మెడికల్ ఫిట్‌నేషన్ సర్టిఫికెట్ విషయంలో సీఐ సుబ్బరాయుడు, వైద్యాధికారి పావని మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో సమస్య పరి ష్కారానికిగాను జిల్లాలోని అన్ని సీహెచ్‌సీల్లో నేర సంబంధిత కేసుల్లో వైద్య చికిత్సలు జరిపి, సీఎం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 1నుంచి గోరంట్లలో ఎంఎల్‌సీ కేసులను ఆసుపత్రిలో పరిశీలించి, పోలీసులకు సమాచారం అందించడం ద్వారా మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేస్తామని ఇన్‌చార్జ్ వైద్యాధికారి వినోద్‌కుమార్ తెలిపారు. అయితే ప్రత్యేక మార్చురీ గది గోరంట్లలోలేని కారణంగా పోస్టుమార్టం నిర్వహించడానికి అవకాశం లేదన్నారు.

టీడీపీ నాయకుడికి సవిత పరామర్శ

పెనుకొండ రూరల్, జూన్ 3: రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోయతిమ్మయ్య రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందారు. ప్రస్తుతం ఆయన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటు న్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత సోమవారం ఆ గ్రామానికి చేరుకుని తిమ్మయ్యను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన క్రాకర్స్ సీజ్



క్రాకర్స్‌ను సీజ్ చేసిన పోలీసులు

చిలమత్తూరు, జూన్ 3: అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 89,650 విలువచేసే పటాసులను పోలీసులు సోమవారం సీజ్ చేసినట్లు ఎస్.ఐ గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో అక్రమంగా క్రాకర్స్‌ని నిల్వ ఉంచినట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో తాను సిబ్బందితో వెళ్లి దుకాణంలో తనిఖీలు చేపట్టామన్నారు. అందులో పెద్ద మొత్తంలో పలు రకాల క్రాకర్స్ పట్టుబడ్డాయన్నారు. క్రాకర్స్ నిల్వలకు సంబంధించి దుకాణదారుల వద్ద ఎలాంటి అనుమతులు లేవన్నారు. దీంతో పాటు ఎన్నికల ఫలితాల సందర్భంగా వాటి విక్రయాలపై నిషేధం ఉండటంతో వాటిని సీజ్ చేశామన్నారు. పట్టుబడిన వాటి విలువ సుమారు రూ. 89690లుగా ఉందన్నారు. దీంతో పట్టుబడిన క్రాకర్స్‌ని సీజ్ చేసి వాటిని అనధికారికంగా నిల్వ ఉంచుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మూడురోజుల తరువాత తేలిన శవం

లేపాక్షి, జూన్ 3 : చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లిన రవికుమార్ నీటిలోపడి మృతిచెందాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలకేంద్రమైన లేపాక్షికి చెందిన రవికుమార్(32) శనివారం గ్రామ సమీపంలోని పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు కాలుజారి గుంతలో పడిపోయాడు. మృతుడి భార్య ఏడేళ్ల కిందటే అతడిని వదిలేసి పుట్టింటికి వెళ్లింది. దీంతో అతడు గ్రామంలో తల్లి సునందమ్మ వద్దే ఉన్నాడు. మృతుడికి మద్యం తాగుడు అలవాటు ఉండటంతో ఎక్కడో ఉంటాడులే అనుకుని మూడు రోజుల నుంచి తల్లి సరిపెట్టుకుంది. సోమవారం మృతదేహం నీటిపై తేలడంతో అటుగా వెళ్తున్నవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడిని తల్లి సునందమ్మ గుర్తుపట్టింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో 8 గొర్రెల మృతి

తనకల్లు, జూన్ 3: మండలకేంద్రంలోని ఇందిరా నగర్‌లో మౌలాలికి చెందిన8 గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. దీంతో రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితుడు సోమవారం వాపోయాడు. రోజులాగానే ఆదివారం ఉదయం గొర్రెలను సమీప పొలాల్లోకి మేతకు తీసుకెళ్లానని, సాయంత్రం ఇంటికి తోలుకొచ్చి షెడ్‌లోకి తోలానని తెలిపారు. రాత్రి సమయంలో గాలివానకు విద్యుత్ వైరు తెగి షెడ్ పైన పడిందని, షెడ్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి 8గొర్రెలు మృతిచెందాయని వాపోయాడు. జీవనాధారం కోల్పోయానని కంటతడి పెట్టాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.



గొర్రెల కళేబరాలు

కౌంటింగ్‌లో అప్రమత్తంగా మెలగండి

ఏజెంట్లకు టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే సూచన



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

హిందూపురం, జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఏజెంట్లు అప్రమత్తంగా మెలగాలని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. సోమవారం హిందూపురంలో ఎంపీ అభ్యర్థి తరుపున కౌంటింగ్‌కు వెళ్తున్న ఆరు నియోజకవర్గాలకు చెందిన ఏజెంట్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ కౌంటింగ్ పూర్తయ్యేవరకు ఏజెంట్లు బయటకు రాకూడదన్నారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే ఆర్‌ఓకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి రౌండ్‌లోనూ అప్రమత్తంగా మెలగాలని సూచించారు. అంతేకాకుండా ఏజెంట్లు సంయమనం పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరు నియోజకవర్గాలకు చెందిన టీడీపీ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు హాజరయ్యారు.

ఏ సమస్య వచ్చినా తెలపండి: సవిత

పెనుకొండ టౌన్: కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు చురుగ్గా ఉండటంతో పాటు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. ఆమె సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో టీడీపీ శ్రేణు లు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... ఎన్నికల ప్రచార సమయం నుంచి పోలింగ్ వరకు ఒక ఎత్తని, కౌంటింగ్ మరో ఎత్తన్నారు. కౌంటింగ్‌లో ఏజెంట్లు కంటిమీద కునుకులేకుండా ఈవీఎంలపై దృష్టి పెట్టాలన్నారు. ఏసమస్య వచ్చినా వెంటనే తనకు సమాచారం అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



టీడీపీ ఏజెంట్లకు అవగాహన కల్పిస్తున్న సవిత

పురానికి బాలయ్య

హిందూపురం, జూన్ 3 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ సోమవా రం సాయంత్రం హిందూపురానికి చేరుకున్నారు. హిందూపురం నుంచి మూడోసారి బరిలో ఉన్న ఆయన మంగళవారం జరుగనున్న ఓట్ల లెక్కింపు సందర్భంగా హిందూపురం వచ్చారు. ఆయన తన నివాసం వద్దకు చేరుకోగానే టీడీపీ నాయకులు, కార్యక ర్తలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఘన స్వాగతం పలికారు. మూడోసారి హ్యాట్రిక్ కొడుతున్నారంటూ, కాబోయే మంత్రి అంటూ ని నాదాలు చేశారు. పలువురు పుష్పగుచ్ఛాలు అందించి ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. కౌంటింగ్‌కు మంగళవారం వెళ్లే ఏజెంట్లు ఉదయం 5.10కు ఇళ్ల నుంచి బయలుదేరి రావాలని సూచించారు. అలాగే టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి పార్థసారథి కూడా సోమవారం సాయంత్రానికి హిందూపురా నికి చేరుకున్నారు. బాలకృష్ణకు స్వాగతం పలికినవారిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు నాగరాజు, బేవనహళ్లి ఆనంద్, హెచ్ఎన్ రాము, రమేష్, చంద్రమోహన్, సతీష్ పాల్గొన్నారు.



బాలకృష్ణకు బొకే అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప

టీడీపీ అధికారంలోకి రావాలని పూజలు



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ మూలవిరాట్, పూజలు చేయిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, జూన్ 3: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని అడదాకులపల్లికి చెందిన టీడీపీ నాయకులు సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అడదాకులపల్లి గ్రామానికి చెందిన కోనంకి రంగనాయకులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సోమవారం మండలంలోని మడకశిర వెళ్లే రహదారి పక్కన వెలసిన సుంకలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ లు చేయించారు. ఆలయ పూజారి చిన్నలింగప్ప ఆధ్వర్యంలో సుంకలమ్మ విగ్రహాన్ని పట్టువ స్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడు తూ... ఇప్పుడు జరుగనున్న ఎన్నికల ఫలితాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి పార్థసారథి అఖండ మెజార్టీతో గెలవాలని, నారా చంద్రబాబు సీఎం కావాలని ఆలయంలో అమ్మవారిని కోరుకున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు, హనుమంతరెడ్డి, బాలాజీనాయక్, తిప్పన్న, ప్రకాశ్‌నాయక్, దుబాయ్‌శీను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిక్షణం జాగ్రత్తగా ఉండాలి: గుండుమల



కౌంటింగ్‌కు బయలుదేరి వెళుతున్న గుండుమల తిప్పేస్వామి తదితరులు

మడకశిరటౌన్, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల్లో విజయం తెలుగుదేశం పార్టీదేనని, కౌంటింగ్ సందర్భంగా ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. హిందూపురం బిట్ కళాశాలలో మంగళవారం ఉదయం జరిగే కౌంటింగ్ లో పాల్గొనేందుకు ఆయన సోమవారం సాయంత్రం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయం నుంచి ఏజెంట్లతో కలిసి బయలుదేరి వెళ్లారు. అంతకు మునుపు ఏజెంట్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మడకశిర నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఎంఎస్ రాజు గెలవబోతున్నారని, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైసీపీ నాయకులు గందరగోళం సృష్టించే అవకాశాలు ఉన్నా యని, ప్రతిక్షణం ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరూ సమన్వ యంతో ఎప్పటికప్పుడు కౌంటింగ్ కేంద్రాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. రాత్రికి శిక్షణ ఏర్పాటు చేశారని ఏజెంట్లు అందరూ రావాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఏజెంట్లతో కలిసి కౌంటింగ్‌కు బయలుదేరి వెళ్లారు.

కూటమి గెలుపు ఖాయం

రొళ్ల: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పిచ్చాపాటిగా మాట్లాడారు. కూటమి గెలుపు ఖాయం అన్నారు. మడకశిరలో ఎంఎస్ రాజు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు గురుమూర్తి, ఈరన్న, సిద్ధగంగప్ప, భరత్, బాలకృష్ణ, కృష్ణమూర్తి, శివన్న తదితరులు ఉన్నారు.

నారసింహపల్లిలో ఉపాధి పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల డిమాండ్

గోరంట్ల, జూన్ 3: మండలంలోని నారసింహపల్లిలో ఆగిన ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న, స్వర్ణలత డిమాండ్ చేశారు. వారు సోమవారం నారసింహపల్లి పంచాయతీలోని చింతలపల్లి, ఎర్రబల్లిల్లో జరుగు తున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధి పనుల గురించి ఆరా తీయగా నారసింహపల్లిలో సోమవా రం నుంచి వారం రోజులపాటు పనులు నిలిపివేశారని కూలీలు తెలిపినట్లు నాయకులు విలేక రులకు తెలిపారు. పనుల విషయంపై వారు ఫీల్డు అసిస్టెంట్ శ్రీరాములను ఫోన్‌ద్వారా సంప్రదించగా ఎన్నికల కౌటింగ్ కారణంగా పనులు కల్పించలేదన్నారు. అంతేగాకుండా అడగడానికి మీరేవరని, నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో విచారించగా కొంతమంది భూస్వాముల ఆదేశాలతో పనులు ఆపివేసినట్లు తెలిసిందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కూలీలకు పనులు కల్పించాలని కోరారు. ఈవిషయమై ఏపీఓ వరప్రసాద్‌ను వివరణ కోరగా... వ్యవసాయ పనులున్నాయని, ఉపాధి పనులు ఆపాలని స్థానిక రైతులు కోరిన ట్లు తెలిపారు. అలా వీలుపడదని, వెంటనే పనులు కొనసాగేలా చర్యలు చేపడతామన్నారు.

దోమల నియంత్రణ చర్యలు



ఇంటింటికి వెళ్లి మందు పిచికారి చేస్తున్న దృశ్యం

అగళి, జూన్ 3 : మండలంలోని వద్రహట్టి గ్రామంలో సోమవారం దోమల నియంత్రణ కార్యక్రమాన్ని డాక్టర్లు శివానంద, గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ... గత సంవత్సరం వద్రహట్టిలో గ్రామస్థులు మలేరియా జ్వరాలు సోకి విపరీతంగా బాధపడ్డారని తెలిపారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది అక్కడికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. దీంతో ముందస్తు జాగ్రత్తగా సోమవారం ఆ గ్రామానికి వెళ్లి మరలా మలేరియా రాకుండా చర్యలు చేపట్టామన్నారు. దోమల నివారణ మందులను మురుగునీటిపై పిచికారి చేశామని, అలాగే ప్రతి ఇంటికి వెళ్లి స్ప్రేయింగ్ చేయించామన్నారు. ప్రతి సంవత్సరం ఆగస్టు, అక్టోబరు నెలలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రజలు కూడా దోమతెరలు వాడాల ని, దోమల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈఓ ఆర్డీ పద్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి సమీవుల్లా, సూపర్‌వైజర్, నర్సారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్బయ్య, సుందరయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, జూన్ 3: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో గణిత శాస్త్రం సబ్జెక్టుకు అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్రం బోధించడానికి (ఎంఎస్‌సీ) అర్హత కల్గిన వారు ఈనెల 10న కళాశాలలో ఉదయం 11గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9703151381 సంప్రదించాలన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత కడప

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు కొనసాగాయి. అనంతపురం, కడప జట్ల మధ్య మ్యాచ్ జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 24 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 23.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించింది. దీంతో కడప మూడు వికెట్ల తేడాతో గెలిచింది. గురు విగ్నేష్ 90 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో... చిత్తూరు, కర్నూలు జట్లు తలపడగా.. మొదు బ్యాటింగ్ చేసిన చిత్తూరు 26 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 26 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన 88 పరుగులు సాధించిన లక్ష్మీనారాయణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. పాయింట్ల ఆధారంగా కడప జట్టును టోర్నీ విజేతగా నిలిచింది. కార్యక్ర మంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

అనంత హ్యాట్రిక్

అనంతపురం క్లాక్‌టవర్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు హ్యాట్రిక్ విజయం సాధించింది. ఈ పోటీలను సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. అనంతపురం, కడప జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత 20 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 11.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 71పరుగులతో విజయం సాధించింది. అనంత బౌలర్ చక్రిక రెండు వికెట్లు తీసుకోవడంతో పాటు 18 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంది.

కనగానపల్లిలో భారీ వర్షం

పుట్టపర్తి రూరల్, జూన్ 3: జిల్లావ్యాప్తంగా ఆదివారం పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా కనగానపల్లిలో 43.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. బత్తలపల్లి 29.2, తాడిమర్రి 28.4, గుడిబండ 23.2, రొళ్ల 22.2, నంబులపూలకుంట 19.2, కదిరి 18.2, నల్లచెరువు 15.2, ధర్మవరం 12.4, తనకల్లు 10.4, గాండ్లపెంట 10.0, నల్లమాడ 8.4, అమరాపురం 5.2, అగళి 4.4, ముదిగుబ్బ 3.2, అమడగూరు 2.0, రామగిరి 1.4, తలుపులలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు.

మడకశిరటౌన్: మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా గత మూడు రోజులుగా పగలు ఎండ కాస్తుండటం, రాత్రి పూట వాతావరణం చల్లబడి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. దీంతో రైతులు తమ పొలాలను విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కిదున్ని చదును చేస్తున్నారు.



మడకశిర పట్టణ సమీపంలో విత్తన సాగుకు సిద్ధం చేసిన భూమి

కౌంటింగ్ కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్ల తరలింపు



పోస్టల్ బ్యాలెట్లను తరలిస్తున్న రెవెన్యూ అధికారులు

పెనుకొండ టౌన్, జూన్ 3 : గతనెల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లను హిందూపురం నియోజకవర్గం బిట్ కళాశాల కౌంటింగ్ హాల్‌కు సోమవారం తరలించారు. స్ట్రాంగ్ రూమ్ నోడల్ అధికారి రాజేశ్వరి పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచి ఐదు బాక్సులను వాహనంలోకి చేర్చారు. ఈ తరలింపులో అన్ని పార్టీ రాజకీయ నాయకులు పాల్గొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లను 2519మంది సద్వినియోగం చేసుకున్నట్లు నోడల్‌అధికారి రాజేశ్వరి తెలిపారు.

పోలీస్ యాక్ట్ 30 అమలు: ఎస్ఐ



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్

పెనుకొండ టౌన్, జూన్ 3 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న సందర్భంగా సోమందేపల్లి మండలంలో 30యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి మాట్లాడుతూ... ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణంలో 144సెక్షన్ తో పాటు 30యాక్ట్ అమలులో ఉందన్నారు. కావున ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఎవరూ టపాసులు కాల్చడం, డీజేలు పెట్టడం, గుంపులు గుంపులుగా ఉండటం నిషేధమన్నారు. అలాగే కౌంటింగ్ సమయంలో సోమందేపల్లిలో టీస్టాళ్ల నుంచి హోటళ్ల వరకు అన్ని బంద్ చేయాలని సూచించారు.

గొడవలకు పాల్పడితే కేసులే

గుడిబండ, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, ఘర్షణలకు పాల్పడితే అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మునిప్రతాప్, ఏఎస్ఐ చంద్రశేఖర్ ప్రజలను హెచ్చరించారు. వారు సోమవా రం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిందూపురంలో మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో టపాసులు, సంబరాలు, డీజేలు తదితర వాటికి పాల్పడవద్దని సూచించారు. అలాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణను అడ్డుకోండి

తహసీల్దార్‌కు రాగిమేకలపల్లి వాసుల ఫిర్యాదు

గోరంట్ల, జూన్ 3: మండలంలోని పి రాగిమేకలపల్లి గ్రామకంఠ ప్రభుత్వ స్థలం ఆక్రమణపై గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ అక్బల్ బాషాకు ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 21-1లోని 10.80 ఎకరాల్లో రాగిమేకలపల్లి ఏర్పాటుకు నాలుగున్నర ఎకరా, శ్మశానవాటికకు మూడెకరాలు కేటాయించారు. భవిష్యత్తులో గ్రామ అవసరాల కోసం మిగిలిన స్థలాన్ని కేటాయించినట్లు గ్రామస్థులు తెలిపారు. కాటేపల్లికి చెందిన ఇద్దరు ఎలాంటి అనుమతులు లేకుండానే గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలంలో రెండునివాస గృహాల నిర్మాణం చేపట్టారు. దీంతో మరి కొందరు మిగిలిన గుట్ట స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదువును చేస్తుండగా గ్రామస్థులు అభ్యతరం తెలిసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని గ్రామస్థులు గోరంట్ల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీ ల్దార్ స్పందిస్తూ ఆ ఇద్దరి నిర్మాణం పనులను వెంటనే ఆపివేయాలని వీఆర్‌ఓను ఆదేశించారు. లేని పక్షంలో వారిపై క్రిమినల్ చర్యలకోసం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ప్రభుత్వ స్థలం ఆక్రమణపై దృష్టి సారిస్తారని తహసీల్దార్ గ్రామస్థులకు తెలిపారు.

పావగడలో రసవత్తరంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

పావగడ, జూన్ 3: కర్ణాటకలో ఆగ్నేయ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం పావగడలో రసవత్తరంగా ముగిశాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన ఎన్నికల్లో దాదాపు 55శాతం ఉపాధ్యాయులు చివరి క్షణం వరకు ఓటేయకుండా డబ్బుల కోసం పోట్లాడటం రెండుపార్టీల్లోనూ అధికంగా కనిపించింది. బీజేపీ నుంచి ఓటుకు రూ.5వేలు ఇస్తే కాంగ్రెస్‌పార్టీవారు ఓటుకు రూ.7వేలు చొప్పున అధికమొత్తంలో ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఓటు వేయడానికి చివరిక్షణం వరకు కొందరు ఉపాధ్యాయులు ఎదురుచూశారు. మహిళా ఉపాధ్యాయులకు పట్టుచీర, రూ.2వేలు విలువు చేసే చేతి గడియారం బహుమతిగా ఇచ్చినట్లు పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తాలూకావ్యాప్తంగా 803ఓట్లు ఉండగా అందులో 764ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ మధ్య రెట్టింపు పోటీ నెలకొంది. ఫలితాలకోసం ఈనెల 6 వరకు వేచి చూడాల్సి ఉంది.

ఏపీ ఫలితాలపై పావగడలో ఉత్కంఠ

పావగడ, జూన్ 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నిల్లో భాగంగా పావగడలో వైసీపీ, టీడీపీ అభిమానుల నడుమ తీవ్ర ఉత్కంఠం నెలకొంది. 20రోజుల నుంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న ఇరుపార్టీల అభిమానులు, కార్యకర్తలు ఓట్ల లెక్కింపు రోజులు కోసం ఆసక్తి గా ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా రూ.లక్షల్లో బెట్టింగులు కాస్తున్న ట్లు సమాచారం. ప్రధానంగా పెనుకొండ, రాప్తాడు, పిఠాపురం నియోజకవర్గాల గెలుపుపై బెట్టింగ్‌లో జోరుసాగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కర్ణాటకలో ఎంపీ ఫలితాలు కూడా మంగళవారం వెలువడనుండటంతో ఇరుపార్టీల కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

అంగట్లో అంగన్‌వాడీ సరుకులు



దుకాణంలో నుంచి అంగన్‌వాడీ సరుకులను బయటకు తీస్తున్న సీడీపీఓ సునీత

పావగడ, జూన్ 3 : ప్రతినెలా చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందజేస్తున్న సరుకులు ప్రైవేట్ దుకాణాల్లో దొరుకుతున్నాయి. తాలూకా పరిధిలోని వైఎన్ హొసకోటలో సోమవా రం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రతినెల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సరుకులను చెకేచేసి చిన్న పిల్లలకు పౌష్టికాహారం కొరత ఏర్పడకుం డా సకాలంలో అందజేయాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు వాటిని ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తుండటం దారుణమని సీడీపీఓ సునీత అన్నారు. అందిన సమాచారం మేరకు ఆమె సోమవారం వైఎన్ హొసకోటలోని ఓ ప్రావిజన్ స్టోర్‌లో తనిఖీలు చేశారు. ఆ దుకాణం లో అంగన్‌వాడీకి చెందిన పాలప్యాకెట్లు, ఇతర సిరిధాన్యాలు దొరికినట్లు సీడీపీఓ తెలిపారు. దీనికి సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవడం తోపాటు ప్రైవేట్ దుకాణాలకు నోటీసులు అందిస్తామని తెలిపారు. అనంతరం వారిపై చర్యలు తీసుకుంటామని సీడీపీఓ హెచ్చరించారు.

యువకుడిపై పోక్సో కేసు

గార్లదిన్నె, జూన్ 3: గార్లదిన్నెకు చెందిన బెస్త నవీన్‌కుమార్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు నవీన్‌కుమార్ మాయమాటలు చెప్పి, మూడు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. దీనిపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నవీన్‌పై పోక్సో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు.